విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - గుడివాడ : ఎస్టీయూ 78వ ఆవిర్భావ సందర్భాన్ని పురస్కరించుకొని అదివారం స్థానిక గౌరశంకరపురంలోని ఎస్టీయు ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యుల ఆధ్వర్యంలో సంఘ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన ఏకైక సంఘం ఎస్టీయూ అన్నారు. సంఘం కోసం, ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణకు కృషిచేసి ప్రాణాలర్పించిన ఎందరో మహానుబావులను స్మరించుకోవడం ముదావహమన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్త, అంతర్జాతీయ ఖోఖో రిఫరీ మడకా ప్రసాద్‌తో 78వ ఆవిర్భావ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్ ప్రసాద్, జిల్లా నాయకులు పి.వి.ఎన్.డి ప్రసాద్, కెవి సత్యనారాయణ, ఎంఎస్ఆర్ పూజేశ్వరరావు, ఐ.అరవింద్, గుడివాడ, నందివాడ, గుడివాడ రూరల్, పెదపారుపూడి మండలాల నాయకులు పాల్గొన్నారు.

స్వామి దీవెనలు గుడివాడ ప్రజలపై ఉండాలి: యలవర్తి

విశాలాంధ్ర - గుడివాడ : అభయాంజనేయ స్వామి కృప కటాక్షం గుడివాడ ప్రజలపై ఉండాలని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నీలామహాలరోడ్డులోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హన్మన్ జయంతి ముగిసిన సందర్భంగా బిఎస్ఎన్ఎల్ సుబ్రహ్మణం వెంకటరమణ దంపతుల వితరణతో కమిటీ సభ్యులు సుంకర నాగర్జున, రత్నగిరి, పూజారి నందూరి రాంబాల అధ్వర్యంలో భక్తులకు అన్నసమారధన నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు నెరుసు చింతయ్య, గొకరంకొండ బలరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు, శ్రీనివాసరావు భక్తులు పాల్గొన్నారు.

ఫాదర్ సురేష్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-అవనిగడ్డ : కోటగిరిలంకలోని ఆర్.సి.ఎం చర్చ్ విచా రణ గురువు జి.సురేష్ మోర్ల గురు పట్టాభి మహోత్సవ కార్యక్రమా న్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఫాదర్ సురేష్ మోర్ల ఫాదర్ అయ్యి 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం చర్చి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం ఫాదర్ లూయిస్ రాజు, ఫాదర్ జాన్ ఫాదర్ సురేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లూయిస్ రాజ్ మాట్లాడుతూ ఫాదర్ సురేష్ 20 సంవత్సరాల్లో చేసిన ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను వివరించారు. ఫాదర్ జాన్ మాట్లాడుతూ గురువు గొప్పతనాన్ని వివరించగా ముందుగా 1918. 1931లో కోటగిరిలంక ఆర్.సి.ఎం చర్చ్‌లో పనిచేసి ఇక్కడే మరణించిన యువ ఫాదర్ పి తిందోరియా, ఫాదర్ పి పాంధాన్, సిస్టర్ సి గోరట్ల మరియు కొవ్వుల ధెరిస్సా, జి సృజనమ్మ, ఫాదర్ సురేష్ తల్లిదండ్రులు గోట్రు సంజీవరావు, జాన్సీ చిత్రపటాలకు ఫాదర్స్, జనరల్స్, అసిస్టెంట్ జనరల్స్, సూపీరియస్, సిస్టర్స్ పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా 200 మంది పేద విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరిలంక సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

సాయి సుప్రియ, అక్షర జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఘనంగా మండలి సాయి సుప్రియ, శీలం అక్షర జన్మదిన వేడుకలను నిర్వహించారు. అవనిగడ్డ ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ, మండలి మనువరావు శీలం అక్షర ల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం షిరిడి సాయి అన్నప్రసాదం నిర్వాహకులు చిట్టా ప్రసాద్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు, సాధువులకు, నిరుపేదలకు 80 మందికి భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. వీరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ద్వారకా తిరుమలలోని స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విశ్వభారతి పూర్వ విద్యార్థికి ఆలిండియా మొదటి ర్యాంక్

విశాలాంధ్ర - గుడివాడ : ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గుడివాడ విశ్వభారతి పూర్వ విద్యార్థికి ఆలిండియాలో 1వ ర్యాంక్ సాధించినట్లు విశ్వభారతి చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు విడుదలయైన ఐఐటీ జెయి అడ్వాన్స్‌డ్ ఫలితాలలో తమ పాఠశాల పూర్వ విద్యర్థి జగన్నాథన్‌మోహిత్ అలిండియా 1వ ర్యాక్, బోతమోళ్ళ చరణ్ ఆలిండియా 2వ రాన్యక్‌తో సంచలన విజయం సాధించినట్లు తెలిపారు. దొరిశాల శ్రీనివసరెడ్డి అలిండియా స్థాయిలో 13వ ర్యాంక్, ఎం.సాయిదివ్వ తేజరెడ్డి 15వ ర్యాంక్, ఎం.సాయిశివలోచన 16వ ర్యాంక్, కె.ప్రభాకర్‌రెడ్డి 18వ ర్యాంక్, వై.సత్యసాయినీలేష్ 20వ ర్యాంక్, కె.జాహ్నవి 78వ ర్యాంక్, డి.ఉపేంద్ర 91వ ర్యాంక్, కె.సూర్యశశాంక్ 94వ ర్యాంక్ వివిధ కేటగిరిలలో సాధించనట్లు తెలిపారు. అద్భుత విజయాలను సాదించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయలను అభినందించారు.

విశ్వభారతి వైజ్‌వుడ్స్ విద్యార్థికి ఆలిండియా 2వ ర్యాంక్

విశాలాంధ్ర - గుడివాడ : ఆదివారం విడుదలయైన ఐఐటీ జెయి అడ్వాన్స్‌డ్‌లో వానపాముల విశ్వభారతి వైజ్‌వుడ్స్ విద్యార్థికి ఆలిండియాలో 2వ ర్యాంక్ సాధించినట్లు విశ్వభారతి చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వైజ్‌వుడ్స్ విద్యార్థి కె.డూండి ఈశ్వర్‌సాయి యశ్వంత్ 2వ ర్యాంక్ సాధించి సంచలన విజయం సాధించినట్లు తెలిపారు. జాతీయస్థాయిలో 2వ సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ ఆర్.మంజుల అభినందించారు.

ట్రాఫిక్ మళ్లింపును సహకరించాలి: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం: ఈనెల 12వ తేదీన రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్న వరం మండల పరిధిలోని కేసరపల్లి, ఐటీ పార్క్ వద్ద నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు, అధికారులు హాజరవుతున్న సందర్భంగా, వాహనదారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా, వారి రవాణాకు అంతరాయం ఏర్పడకుండా, పలు ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను జిల్లా పోలీసులు ఏర్పాటు చేయడం జరిగింది. కావున ప్రజలు ఈ ట్రాఫిక్ మళ్లింపులను దృష్టిలో ఉంచుకొని, మీ యొక్క ప్రయాణాలు నిర్ణయించుకోవాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఐపీఎస్ పత్రికా ముఖంగా తెలియజేశారు.

ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు

విశాఖ పట్నం నుండి చెన్నై వైపు వెళ్లే వాహనాలను-
1.కత్తిపూడి నుండి జాతీయ రహదారి 216 మీదుగా ఒంగోలు వైపు.
2.విశాఖపట్నం నుండి చెన్నై వెళ్లి వచ్చే వాహనాలను కత్తిపూడి నుండి ఒంగోలు వైపు మళ్లించడం జరిగింది.
చెన్నై నుండి విశాఖపట్నం వైపు వచ్చు వాహనాలు-1.ఒంగోలు నుండి రేపల్లె మీదుగా వయ మచిలీపట్నం - లోసర్ బ్రిడ్జి - నరసాపురం - అమలాపురం - కాకినాడ - కత్తిపూడి మీదుగా విశాఖపట్నం వైపు మరలించడం జరిగింది.
2.బుడంపాడు నుండి తెనాలి - పులిగడ్డ - మచిలీపట్నం - లోసర్ బ్రిడ్జి - నర్సాపురం - కాకినాడ - కత్తిపూడి వైపు మళ్లింపు.
విశాఖపట్నం నుండి హైదరాబాద్ వెళ్ళే వాహనాలను
1.గామన బ్రిడ్జి - దేవరపల్లి - జంగారెడ్డిగూడెం - అశ్వరావుపేట - ఖమ్మం మీదుగా హైదరాబాద్
2.భీమడోలు - ద్వారకాతిరుమల - కామవరపుకోట - చింతలపూడి నుండి ఖమ్మం వైపు,
3.ఏలూరు బైపాస్ నుండి - జంగారెడ్డిగూడెం మీదుగా అశ్వరావుపేట - ఖమ్మం మీదుగా హైదరాబాద్ వైపు,
4.ఏలూరు బైపాస్ - చింతలపూడి నుండి సత్తుపల్లి మీదుగా,
5.హనుమాన్ జంక్షన్ - నూజివీడు, మైలవరం - ఇబ్రహీంపట్నం - నందిగామ మీదుగా హైదరాబాద్ వైపు మళ్లింపు. హైదరాబాద్ నుండి విశాఖపట్నం వచ్చు వాహనాలను,1.నందిగామ - మధిర - వైరా - సత్తుపల్లి - అశ్వరావుపేట - జంగారెడ్డిగూడెం - దేవరపల్లి - గామన బ్రిడ్జి మీదుగా విశాఖపట్నం వైపు
2.ఇబ్రహీంపట్నం - మైలవరం - నూజివీడు - హనుమాన్ జంక్షన్ నుండి ఏలూరు బైపాస్ మీదుగా విశాఖపట్నం వైపు.
3.రామవరప్పాడు - నున్న - పాముల కాలువ - వెలగలేరు - జి.కొండూరు - మైలవరం - నూజివీడు - హనుమాన్ జంక్షన్ - ఏలూరు బైపాస్ మీదుగా విశాఖపట్నం వైపు.
4.విజయవాడ నుండి ఎనికేపాడు మీదుగా 100 అడుగుల రోడ్డు - తాడిగడప - కంకిపాడు - పామర్రు - గుడివాడ నుండి భీమవరం వైపు
పైన తెలిపిన ట్రాఫిక్ మళ్లింపును ప్రజలందరూ దృష్టిలో ఉంచుకొని మీ ప్రయాణాలను కొనసాగించాలని, అలాగే పోలీస్ వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు

ఎమ్మెల్యే సారూ.. రోడ్లపై దృష్టి సారించండి..

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలో సామాన్యు లకు సైతం ప్రధాన ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరుగుతున్న ప్రధాన రహదారులపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని ఈనెల నాలుగవ తారీఖున అత్యధిక మెజార్టీతో పామర్రు నియోజకవర్గంకు ఎన్డీఏ కూటమి తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన వర్ల కుమార్ రాజాను పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లపై దృష్టి సారించకపోవడంతో పడిన గోతులు పెరిగి పెరిగి వాహనదారులనే కాకుండా పాద చారులను సైతం ప్రమాదాల పాలు చేస్తున్న సంగతిని బాధితులు ప్రస్తావిస్తున్నారు. ఇదే సమయంలో రోడ్లపై పడిన గోతులలో వర్షాకాలంలో నిలిచిన నీటిలో వరి నాట్లు వేసిన విషయాన్ని సైతం మర్చిపోకుండా రహదాంఁల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు రావాలని మండల ప్రజలు కోరుతున్నారు. కూచిపూడి కేంద్ర బిందువుగా తీసుకొని మొవ్వ మీదుగా కొడాలి వెళ్లే రోడ్డు, పెడసనగల్లు, భట్లపెనుమర్రు వెళ్లే రహదారి, కూచిపూడి నుంచి బార్లపూడి, కూచిపూడి నుంచి పెదపూడి మీదుగా బందరు వెళ్లే రహదారి, పామర్రు వెళ్లే రహదారి, కృష్ణాపురం వెళ్లే రహదారి, బార్లపూడి నుంచి భట్లపెనుమర్రు రోడ్డు, మొవ్వ నుంచి పెదముత్తేవి మీదుగా కోసూరు, ఘంటసాల వెళ్లే రోడ్డు, కోసూరు నుంచి మల్లంపల్లి వెళ్లే రోడ్డు, కోసూరు నుంచి కాజ వెళ్లే రోడ్డు. బార్లపూడి నుంచి నర్సంపాలెం మీదుగా మొవ్వ వెళ్లే రోడ్డు, కారకంపాడు నుంచి అయ్యంకి వెళ్లే రోడ్డు, కారకంపాడు నుంచి పెదముత్తేవి వెళ్లేరోడ్డు... ఇలా ఆర్ అండ్ బి, జిల్లా పరిషత్ రహదారుల పరిస్థితి దుర్భరంగా ఉండి గోతులతో లేచిన కంకరరాళ్ళతో భయంకరంగా మారిన సంగతి విధితమే. ఈ రహదారులపై ప్రయాణం చేస్తుంటే నరకప్రాయంగా మారిపోతుందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా వర్షం వచ్చిన సమయంలో అయితే గోతులలో పడిపోయే పరిస్థితి ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని ఈనెల 12న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం కొనసాగే అసెంబ్లీ సమావేశాలలో రహదారుల దుస్థితిని ప్రస్తావించి నిధులు మంజూరుకు కృషిచేసి సమస్యను తొలగించాలని కోరుతున్నారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరుకు ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నందున ఈలోగా మానవతా దృష్టితో సమస్యలను పరిగణలోనికి తీసుకొని కనీసం ప్రమాదకరంగా తయారైన గోతులను యుద్ధప్రాతిపదికన పూడ్చించి ఆదుకోవాలని వాహనదారులు కుమార్ రాజాను కోరుతున్నారు.

క్యాంపెయిన్లపై ప్రభుత్వ జూనియర్ కళాశాల దృష్టి

విశాలాంధ్ర-కూచిపూడి: గ్రామాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సైతం కార్పొరేట్ స్థాయి కాలేజీలతో పోటీలు పడి విద్యార్థుల కోసం క్యాంపస్లు నిర్వహిస్తున్నాయి. అయినా ఆ క్యాంపైన్లులో పలువురు స్పందన కొరవడిందని అధ్యాపకులు పేర్కొంటున్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర స్థాయిలో ఉత్తీర్ణతలో పలుసార్లు ప్రథమ స్థానాలు పొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ద్వారా ఉత్తమ అవార్డులు సాధించి గుర్తింపు పొంది, గత రెండు సంవత్సరాలుగా జిల్లా స్థాయిలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతలో మొదటి స్థానంలో నిలిచిన మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల సైతం ఈ ఏడాది విద్యార్థుల కోసం క్యాంపైన్లు కొనసాగించారు. అయితే ఈ క్యాంపెయిన్ ఏమంత ఆశాజనకంగా లేదని అధ్యాపకులు ద్వారా వచ్చిన సమాచారం. వీరంతా పదవ తరగతి పరీక్ష ఫలితాలు వచ్చిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థుల కోసం మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ కళాశాలకు విద్యార్థినీ విద్యార్థులు విచ్చేసేమొవ్వ, గూడూరు, పమిడిముక్కల, ఘంటసాల మండలాలోని గ్రామాల విద్యార్థుల వద్దకు వెళ్లారు. వారి తల్లిదండ్రులకు తమ కాలేజీలోని ఉత్తీర్ణతను, కళాశాలలో గల వసతులను, అధ్యాపకుల వివరాలను కోర్సుల వివరాలను వివరించారు. విద్యార్థులలో కొందరి దృష్టి ట్రిబుల్ ఐటీపై, మరి కొందరు పాలిటెక్నిక్ పై, కార్పొరేట్ కళాశాలపైమొగ్గు చూపుతున్నారన్నట్లు, కొందరు ఈ కళాశాలలో చేర్పించడానికి ఆసక్తి కనపరిచినట్లు తెలిసింది. ఇది ఇలా ఉండగా కళాశాలలో ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన అడ్మిషన్ ప్రక్రియల ద్వారా ఈ నెల 7వ తేదీ నాటికి (శని ఆదివారాలు సెలవులు) 90 మంది జాయిన్ అయినట్లు సమాచారం. దీనిలో ఎంపీసీ గ్రూపులో 28 మంది, బైపీసీలో 32, సీఈసీలో 21, హెచ్ఈసిలో ముగ్గురు విద్యార్థులు చేరారని, మిగిలిన 14 మంది వృత్తి విద్యా కోర్సులలో చేరినట్లు ప్రిన్సిపాల్ కేవీఎస్‌వీ ప్రసాదశాస్త్రి వివరించారు. ఈ విద్యార్థులకు సోమవారం నుంచి తరగతులు ప్రారంభించనున్నామని చెప్పారు.

స్వామి వారిని దర్శించుకున్న మండలి కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రంలోని వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామి వారిని దర్శించుకోగా మండలి కుటుంబ సభ్యులను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు వేద పండితులు ఘనంగా స్వాగతం పలికి వేదమంత్రోఛ్ఛారణలతో ఆశీసులు అందించి స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం బహుకరించారు. మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మీ, కుమారుడు రాజా, కోడలు సాయి సుప్రియ, పెద్ద కుమార్తె కృష్ణ ప్రభ, అల్లుడు శీలం అశ్విని కుమార్, మనువరాలు అక్షర స్వామి ఉన్నారు.

లక్ష్మీసాయి మందిరం స్లాబ్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర అవనిగడ్డ : భక్తుల సహాయ సహకారాలతో లక్ష్మీసాయి మందిరం భవన నిర్మాణ పనులు చకచక జరుగుతున్నాయి. 3వ వార్డులోని ఎస్.వి.ఎల్ విద్యా సంస్థల సమీపంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న లక్ష్మీసాయి మందిర నిర్మాణానికి భక్తులు సహాయ సహకారాలు అందించడంతో ఆదివారం స్లాబ్ పనులు ప్రారంభించి స్లాబ్ పూర్తి చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో లక్ష్మీసాయి బాబాతో పాటు మరికొంత మంది దేవతా విగ్రహాలు, మొదటి అంతస్థులో దత్తాత్రేయ స్వామి వారిని ఏర్పాటు చేసేందుకు పెద్దలు నిర్ణయించగా ఆ దిశగా పనులు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మీడియా రంగానికి రామోజీ ఆదర్శం

విశాలాంధ్ర-అవనిగడ్డ : బహుముఖ ప్రజ్ఞశాలి, ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావ్ పత్రికా రంగానికే ఆదర్శం అని పలువురు పేర్కొన్నారు. ఆదివారం తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడారు. తెలుగు నాట తొలిసారి 24 గంటల వార్త స్రవంతికి శ్రీకారం చుట్టింది రామోజీరావ్ అని, పాత్రికేయులు, మీడియా రంగానికి ఆయన సేవలను కొనియాడుతూ పత్రికా రంగంలో నూతన వరవడిని సృష్టించారని, తెలుగు భాషాభివృద్ధికి, సిని రంగానికి రామోజీరావ్ చేసిన విశేష సేవలను కొనియాడారు. తెలుగు పాత్రికేయాన్ని వ్యవహారిక బాట పట్టించిన భాషా సంస్కర్త అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతి పేరు సూచించారని, చేసే పనిని ప్రేమించే రామోజీరావ్ నేటి యువతరానికి ఆదర్శం అని, రామోజీ ఫిల్మం సిటీ ద్వారా చలన చిత్ర రంగానికి ఒక చక్కని వేదికను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మెండు లక్ష్మణరావు, కర్రా సుధాకర్, బచ్చు రఘునాద్, విశ్వనాధపల్లి వెంకట స్వామి, గుంటూరు వినయ్, మండలి రాంమోహన్‌రావు, బచ్చు మురళి, సనకా బసవయ్య, పులిగడ్డ నాంచారయ్య, లింగం బాబూరావు, కంచర్ల ఆనంద్, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

విశాలాంధ్ర - చల్లపల్లి: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను కొనసాగించి తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా సబ్జైళ్ల అధికారి జి. విజయ్ దేని అన్నారు. ఆదివారం చల్లపల్లి సీఆర్ వికాస కేంద్రంలో ఎస్సార్వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ (1987-2020) ఆధ్వర్యంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిలు, సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న విజయ్ దేనీ (కళాశాల పూర్వ విద్యార్థి) మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ గురువులు, తల్లిదండ్రుల సూచనలు పాటించాలని కోరారు. తన జీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్న వైనం వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు ఎదుగవచ్చన్నారు. మరో ముఖ్య అతిథి, పూర్వవిద్యార్థి.. విశ్రాంత సుబేదార్ మిలటరీ పోలీస్ మద్దిపట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు దేశ సేవ చేయాల్సిన ఆవశ్యకత వివరించారు. స్ఫూర్తిదాయక ప్రసంగంతో విద్యార్థులను చైతన్యపరిచారు. చదువులోనూ, జీవితంలోనూ స్నేహితుల పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు. 46 మంది విద్యార్థినీ, విద్యార్థులను తల్లిదండ్రులతో కలిసి సత్కరించి రూ.80,500 నగదు బహుమతులను, జ్ఞాపికలను అందచేశారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి. అశ్వినీకుమార్, బీడీఆర్, ప్రతినిధులు లంకె సుభాషిణి, వి.చారుమతి, ఎ.సాయికుమారి, అడ్డాడ ప్రసాద్బాబు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఎండిఏకే. జిలానీ, వాసిరెడ్డి రాకేష్,మాలెంపాటి శ్రీనివాసరావు, వేములపల్లి అనిల్, చేతన్, బొందలపాటి నాగమల్లేశ్వరరావు, ఉప్పాల నాంచారయ్య, మోర్ల శివ, జన్ను నాంచారయ్య, కేతన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

అందరి సహకారంతోనే అభివృద్ధి: బెనర్జీ

విశాలాంధ్ర-చల్లపల్లి : సంఘ సభ్యులు, సిబ్బంది, రైతులందరి సహకారం తోనే అభివృద్ధి సాధించామని వక్కలగడ్డ పిఏసిఎస్ చైర్పర్సన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పేర్కొన్నారు. గత ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు తమ రాజీనామా పత్రాలను సంఘ కార్యదర్శి పుట్టి వెంకటేష్ బాబుకు సమర్పించారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ 22 సంవత్సరాల పాటు సంఘ అభివృద్ధి కోసం కృషి చేశానని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల క్రితం త్రిసభ్య కమిటీ లో భాగంగా తనను చైర్పర్సన్ గా గత ప్రభుత్వంలో నియమించారని, ప్రభుత్వం మారిన నేపథ్యంలో తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సభ్యుల సహకారంతోనే వక్కలగడ్డ పిఏసిఎస్ అభివృద్ధి పథంలో పయనిస్తుందని సురేంద్రనాథ్ బెనర్జీ పేర్కొన్నారు. దేశానికే వక్కలగడ్డ సొసైటీ ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. ఇంతటి గొప్పపేరు సంఘానికి రావడానికి సంఘ సభ్యులు, రైతులు, సిబ్బంది యొక్కసహకారం అన్నారు,. ఉత్తమ సొసైటీగా వక్కలగడ్డ పి ఏ సి ఎస్ కు అవార్డు రావడం తనకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. రైతులు ప్రతీ సంవత్సరం వంద శాతం రుణాలు చెల్లించి సహకరిస్తుడమే ఈ అవార్డు రావడానికి కారణమని ఆయన తెలిపారు. వక్కలగడ్డ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎప్పుడు పార్టీలకు అతీతంగా పనిచేస్తుందని, పార్టీల కన్నా సంఘ అభివృద్ధి కోసం పనిచేసానని తెలిపారు. గతంలో అధ్యక్షులు గా పనిచేసిన మల్లుపెద్ది రామసుబ్బయ్యఅడుగు జాడల్లో నడుస్తూ తనుకూడా సహకారసంఘం అభివృధి కి కృషి చేసినట్లు పేర్కొన్నారు. తనపై ఉంచిన బాధ్యతలను సంఘ సభ్యులు, సిబ్బంది సహకారంతో సమర్ధవంతంగా నిర్వహించగలిగానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్సన్స్ గోరిపర్తి రాణి,మట్టా నాంచారయ్య, మల్లుపెద్ది బోసు, అల్లూరి బాబురావు, మల్లుపెద్ది లెనిన్, సాయి రత్నబాబు, సిపిఐ వక్కలగడ్డ కార్యదర్శి నక్క శ్రీనివాసరావు, మణిప్రభాకరరావు, ఆర్ఎంపి శేషు సంఘ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాళారంగానికి టీడీపీ పెద్దపీట: యలవర్తి

విశాలాంధ్ర - గుడివాడ : కళారంగానికి పెద్ద పీఠ వేసి గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగా గుడివాడ కళాకారులకు ప్రభుత్వం ద్వార నాటకులు చేయించి వారికి రూ.5లక్షలు అందించిన ఘనత టిడిపికే దక్కుతుందని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. అదివారం స్థానిక నీలామహాల్ రోడ్డులోని కాళాకారుల సంఘం కార్యలయంలో టిడిపి ఘనం విజయసాధించినందుకు, పేద కళాకారులకు రూ.1000 చొప్పన అందించేందుకు ముందుకు విచ్చన ఉపాధ్యాయుడు శీరం శ్రీనివాసరావును సత్కరించే కార్యక్రమాన్ని సంఘం గౌవర అధ్యక్షుడు నెరుసు చింతయ్య అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న యలవర్తి శ్రీనివాసరావు శీరం శ్రీనివాసరావును దుశ్శాలువతో సత్కరించి, పేద కాళాకారుల ఫించను అందజేశారు. ఈ సందర్బంగా యలవర్తి మాట్లాడుతూ కళాకారులు కళకళాడితే అ ప్రాంతం సుభీక్షంగా ఉంటుందన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా కళాకారుల సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించి అదుకోవడం జరిగిందన్నారు. గుడివాడ నియోజకవర్గలో టిడిపి అభ్యర్థిగా 53వేల మెజార్టీతో గెలుపొందిన వెనిగండ్ల రాము సహకరంతో కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గరావు, గోకరకొండ బలరామ్, టిడిపి నాయకులు కొలుసు రాజా, సంఘ అధ్యక్షుడు కొడాలి రాజా, కార్యదర్శి గాజులపల్లి కొండయ్య, ట్రజరీ కోటేశ్వరి, గౌవర ఉపాధ్యకుడు పి.స్వామిదాసు, నాయకులు శివాజీ, బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు స్థల పరిశీలన

విశాలాంధ్ర-గన్నవరం: ఈనెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో బహిరంగ సభ ఏర్పాటుకు అవసరమైన స్థలాల పరిశీలన కృష్ణా జిల్లా కలెక్టర్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్లు డీకే బాలాజీ, ఢిల్లీ రావు, రాష్ట్ర రవాణా రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న, గన్నవారాం మండలంలోని కేసరపల్లి గ్రామంలో గల ఐటీ పార్క్ మేధా టవర్స్ సమీపంలో ప్రధాన బహిరంగ సభ, పార్కింగ్ ప్రదేశాలు ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, జాతీయ రహదారి పక్కన మేధా టవర్స్ వెళ్లే మార్గంలో పార్కింగ్ ప్రదేశాలను వారు పరిశీలించారు.ప్రొక్లైన్తో ముళ్ళపొదలు తొలగిస్తున్న పనులను కూడా వారు పరిశీలించారు. మేధా టవర్స్ పై అంతస్తు పైకి వెళ్లి అక్కడి నుండి బహిరంగ సభ ప్రదేశాన్నివారుపరిశీలించారు.ప్రజలు, వాహనాలు రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఏర్పాటు చేయవలసి ఉంటుందన్నారు.గన్నవరం విమానాశ్రయం సందర్శించి అక్కడ పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించి ప్రముఖుల రాకపోకలపై చర్చించారు.ఈ పర్యటనలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, కృష్ణ ఎన్టీఆర్ జిల్లాల సంయుక్త కలెక్టర్లు గీతాంజలి శర్మ, సంపత్ కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడుకర్, డి ఐ జి గోపీనాథ్ జెట్టి, విజయవాడ డిసిపి అదిరాజ ఎస్. రానా, గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎమ్మెల్యేకే రెడ్డి, గుడివాడ ఆర్డిఓ పి పద్మావతి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇవ్వటం సంతృప్తికరం: బాపిరాజు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: నిరాశతో ఉన్నవారికి నియామక పత్రం ఇవ్వడం ఎంతో సంతృప్తి ఇచ్చిందని మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజు అన్నారు. 2017 నుండి ఏడు సంవత్సరాలు అపరిష్కృతంగాఉన్న మూడు కారుణ్య నియామకాలను పరిష్కరించి మున్సిపల్ కమిషనర్ గా, మార్చినెల 2024 సంవత్సరంలో ఇద్దరికీ ఆఫీస్ సబార్డినేట్లుగా, ఒకరికి నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్ గా ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ సిహెచ్ వీవీఎస్ బాపిరాజు మాట్లాడుతూ, కార్తికేయ, శ్రీవల్లి, శివశంకర్లకు ఉద్యోగాలు ఇచ్చినప్పుడు ఎంతో ఆ నిర్వచనీయమైన సంతృప్తి కలిగిందని, కింది స్థాయి ఉద్యోగులకు ఏదైనా అవసరం వస్తే వెంటనే తనను సంప్రదించాలని, తాను తగిన పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

లారీని ఢీకొని యువకుడి మృతి

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: అతివేగం ఒక ప్రాణం తీసింది. వివరాల్లోకి వెళితే ఆదివారం మచిలీపట్నం చల్లపల్లి బైపాస్ రోడ్ లో, ముందు వెళుతున్నకంటైనర్ను బైక్ పై వెళుతున్న యువకుడు వేగంగా ఢీకొనటం వల్ల సంఘటన స్థలంలోనే మృతి చెందడం జరిగింది. మృతుడు మచిలీపట్నం గోసంఘంకు సమీపంలోని ఎస్సీ కాలనీకి చెందిన బాపట్ల బంగారం గా గుర్తింపు. యువకుని వయస్సు 18 సంవత్సరాలు అని తెలుస్తుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అమ్మవారి జాతర మహోత్సవం

విశాలాంధ్ర అవనిగడ్డ : రెడంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కొత్త ఎడ్లంక 9 వ వార్డులోని (పద్మశాలి) బట్టు వారి కులదైవం అయిన రెడంకమ్మ వారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5 వ తేది బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు, విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గత 5 రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహిస్తూ అమ్మవారిని విశేషంగా అలంకరిస్తున్నారు. ఆదివారం అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష గాజులతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించి గాజులతో సుందరంగా అలంకరించారు. ఈ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని బట్టు వారి వంశస్థులు దేశ విదేశాలలో ఉన్నవారు సైతం భారీగా తరలిరావడంతో ఆ ప్రాంతంలో శనివారం నుండే జాతర మహోత్సవ ఛాయలు కనిపించాయి. ఆదివారం వేకువ జామునే అమ్మవారికి ప్రత్యేక మ్రొక్కుబడులు భక్తులు చెల్లించుకోగా 1500 మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమంలో నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహక సభ్యులు భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఆలయ అర్చకులు బట్టు నరసింహారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే తాతయ్యకు ఎస్ఐ అభినందనలు

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన కూటమి అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యను పెనుగంచిప్రోలు పోలీసు స్టేషన్ ఎస్ఐ పి.రాంబాబు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి పచ్చని మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

శ్రీతిరుపతమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆలయ అర్చకులు వేద పండితులతో వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి స్వామివారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్నదానానికి విరాళం

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగు అన్నదానానికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరం మాచవరం డౌన్ వాస్తవ్యులు మల్లెల రిషికేశ్ సాయి పదివేల ఒక్క రూపాయలు ఆలయ అధికారులకు ఆదివారం అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

విశాలాంధ్ర-తిరువూరు: బీసీ హాస్టల్ సమీప ఎన్ఎస్పి కాలవ శివారులో ఆదివారం ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడి కొమిరెడ్డిపల్లి గ్రామ శివారు గొల్లగూడెం గ్రామానికి చెందిన బట్టు శ్రీను మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. సంఘటనపై తిరువూరు ఎస్సై కేవీవీ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు.

శ్రీతిరుపతమ్మను దర్శించుకున్న జడ్జి

విశాలాంధ్ర - పెనుగంచి ప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని ఉమ్మడి కృష్ణా జిల్లాల జడ్జి సారిక అరుణ, జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జ్ కే శ్రావణి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అమ్మవారి స్వామివారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు లోని పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి బాణాసంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ వారిని దర్శించుకుని నరేంద్ర మోడీ పరిపాలన సజావుగా జరగాలి భారతదేశం వికసిత భారత్‌గా అభివృద్ధి చెందాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతమ్మ అమ్మ ఆలయ మాజీ చైర్మన్ కర్ల. వెంకటనారాయణ, బిజెపి నాయకులు కలూరి శ్రీవాణి, కర్ల కోటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్): మానవ సేవే మాధవ సేవ అని డాక్టర్ బ్రహ్మ దేశం వసంత్ కుమార్ అన్నారు. ఆదివారం మాతృ దేవో భవ వృద్ధుల ఆశ్రమంలో బిసి సంఘం రాష్ట్ర నేత వీరంకి గోకర్ణేశ్వర రావు పుట్టిన రోజు పురస్కరించి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల సంతృప్తి కలుగుతుందని గోకర్ణేశ్వర రావు అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటి గవర్నర్ డాక్టర్ బ్రహ్మ దేశం వసంత్ కుమార్.రీజినల్ కార్యదర్శి కొండాయ గుంట రాము.జోన్ కార్యదర్శి గుర్రం ఏడు కొండలు,రాజా రావు.ఆశ్రమ నిర్వాహకులు దుర్గ, జ్ఞానేంద్ర,ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

తాతయ్యకు ట్రాఫిక్ పోలీసులు అభినందనలు

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఆర్ శ్రీనివాసరావు వారి సిబ్బందితో కలిసి జగ్గయ్యపేట శాసనసభ్యులుగా నూతనంగా ఎన్నికైన శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ని ఆదివారం ఆయన స్వగృహం లో మర్యాదపూర్వకంగా కలిసి నోట్ బుక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కామ్రేడ్ నడకుదుటి సూర్యప్రకాష్ రావు సంస్మరణ సభ

విశాలాంధ్ర-విజయవాడ : నడకుదుటి సూర్య ప్రకాష్ రావు సంస్మరణ సభ ఆదివారం పేర్రి గ్రామంలోని ఆయన నివాసం వద్ద జరిగింది. ఈ సభకు కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి టీ తాతయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. మరో అతిథి ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకాష్ రావు కమ్యూనిస్టు పార్టీకి చేసిన సేవలు ప్రశంసనీయమైనదని, ఆయన మండల పరిషత్ సభ్యులుగా పనిచేస్తూ, అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన యువజన రంగంలో చురుకైన పాత్ర నిర్వహించారని తెలిపారు. ఆయన పలు కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉండి ఆ సంఘాల సమస్యలను పోరాటాల ద్వారా పరిష్కారం చేశారన్నారు. ఈ సభలో కృష్ణా జిల్లా సీపీఐ మాజీ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా రైతు సంఘం నాయకులు వెలగపూడి అజాద్, ఎంసీపీఐ యు ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాదరావు, కృష్ణాజిల్లా ప్రజానాట్య మండలి నాయకులు పి.నాగేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, ఇబ్రహీంపట్నం మండలం సీపీఐ కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, జిల్లా రైతుసంఘం కార్యదర్శి మల్లెడు ఎలమందరావు, కాల్

ప్రముఖుల నివాళి

రైతు సంఘం ఉపాధ్యక్షులు పే య్యల వెంకటేశ్వరరావు, పేర్రి గ్రామశాఖ సీపీఐ కార్యదర్శి ఎన్ ప్రసాద్, వైఎస్సార్ పార్టీ నాయకులు మిక్కిలి శరభయ్య, బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయ కులు నిడముక్కల శివశంకర్, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ రాష్ట్ర తెలుగుదేశం విభాగం కన్వీనర్ పేతా శ్రీనివాస్ రాజు, విజయవాడ నగర సీపీఐ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు అప్రబోతు రాము, తాడిపైడియ్య, ఎంసిపిఐ యు నగర కార్యదర్శి కాసాని గణేష్ బాబు, ఎం.సాంబశివరావు అధ్యక్షులు కె.ఆర్ ఆంజనేయులు దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు బుట్టి రాయప్ప, మైలవరం సీపీఐ నాయకులు బి.వెంకట్రావు, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ-ప్రజాస్వామ్య-సెక్యులర్ ఆకాంక్షలను నెరవేర్చండి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనలో రాజ్యాంగ - ప్రజాస్వామ్య - సెక్యులర్ ఆకాంక్షలను నెరవేర్చాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున విజ్ఞప్తి చేస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు కె.ఎమ్.ఎ సుభాన్ తెలిపారు. అదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు ఎన్డీఏ ప్రభుత్వ నిర్మాణంలో మీ స్థానం అత్యంత కీలకమైనదని తద్వారా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను పూర్తి నేరవేర్చుతారని అశాభావం వ్యక్తం చేశారు. ప్రధానంగా రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సమాఖ్యా స్వరూపాలకు ప్రమాదం ఏర్పడిన ప్రస్తుత తరుణంలో టిడిపి కీలక స్థాయికి చేరడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. రాష్ట్ర ప్రజలు తమ ఆకాంక్షలను నెరవేర్చే నేతగా చంద్ర బాబు స్థాయి రాష్ట్రం, దేశంతో పాటు అంతర్జాతీయ స్థాయికి చేరాలని కాంక్షిస్తూన్నామన్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించుకొవ లసిన తరుణం ఇదే అన్నారు. రాష్ట్ర ప్రజల కలల పంట పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు తీసుకువచ్చి పూర్తి చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా అపటంతో పాటు కేజీ బేసిన్‌లో రాష్ట్ర వాటాను సాధించాలన్నారు. రైల్వేజోన్, కడప ఉక్కు, కోస్టల్ కారిడార్ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కోసం ప్రణాళికలు రూపొందించి సాధించుకొవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు అందించే స్కాలర్‌షిప్‌ల పునరుద్ధరణ కోసం వారి ఆర్థిక, విద్యా, వైద్య, ఉద్యోగ సాధనలో సహకారం అందించాలన్నారు. అంతర్జాతీయంగా మన విదేశీ వ్యవహారాలను శాంతి స్థాపన కోసం, బలహీన దేశాల రక్షణ కోసం, బలవంత దేశాల దౌర్జన్యాలను, ఆక్రమణలను నిరోధించేందుకు చర్యలు తీసుకొవాలన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, మత సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కృషి చేయాలి. అన్యాయంగా నిర్బంధించి ఉన్న దళిత, ఆదివాసి, మైనారిటీ, ప్రజాస్వామిక యువతీ, యువకుల విడుదలకు కృషిచేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి చంద్రబాబు నాయకత్వానికి మైనారిటీలు అండగా నిలిచారని వారికి రాష్ట్ర, కేంద్ర మంత్రి వర్గంలోనూ మైనారిటీ ప్రతినిధికి అవకాశం కల్పించవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జాని, కార్యదర్శులు సత్యనారాయణ,హకీమ్, మున్వర్, కరీమ్, జమాన్, ఇనాయతుల్లా, కోశాధికారి మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

కంచల నుంచి అంబారుపేటకు పాదయాత్ర

విశాలాంధ్ర- నందిగామ: నందిగామ మండలం కంచల గ్రామ తెలుగు దేశం పార్టీ, జనసేనపార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అయ్యేందుకు ఎన్డీఏ కూటమికి మెజార్టీ సీట్లు గెలిచినందుకు, విజయవాడ ఎంపీ గా కేశినేని శివనాథ్ చిన్ని, నందిగామ శాసనసభ్యులుగా శ్రీమతి తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట నియోజకవర్గం శాసనసభ్యులుగ రాజగోపాల్ తాతయ్య, మైలవరం శాసనసభ్యులుగా వసంత కృష్ణ ప్రసాద్ ఎన్నికైనందుకు గాను కంచల గ్రామం నుండి పాదయాత్రగా నడుచు కుంటూ అంబారుపేట శ్రీ సత్యమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడి చెల్లించుకున్న నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ వీరంకి వీరాస్వామిన్ మరియు కంచల గ్రామ తెలుగుదేశం పార్టీ ,జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు 'సీటీజన్స్ ఫర్ డెమొక్రసీ' అభినందన సభ

విశాలాంధ్ర-విజయవాడ: సిద్దార్థ ఆడిటోరియంలో సాయంత్రం 4గంటలకు ఆత్మీయ అభిందన సభ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వోదయ ట్రస్ట్ జిఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి సంఘం పేర్కొంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలు వారి ఓటు హక్కు వినియోగించుకొని, ఈ ప్రధాన లక్ష్యంతో గత సంవత్సరం ఏర్పాటైన సిటీజెన్స్ ఫర్ డెమోక్రసి సంస్థ రాష్ట్ర స్థాయిలో ప్రధానమైన నగరాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా యువత ఓటర్లను చైతన్య పరిచి తమ ఓటు హక్కు వినియోగించేందుకై జరిపిన కృషి ఎంతో అభిందనీయమని పేర్కొన్నారు. మాజీ న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో గతంలో పనిచేసిన ఉన్నతాధికారులు, తమ పదవీరమణ అనంతరం ప్రజాసేవా కాంక్ష కలిగిన వివిధ వర్గాలకు చెందిన వారితో కలిపి ఈ సీటిజెన్స్ ఫర్ డెమోక్రసి సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగం పై విస్తృతంగా చైతన్యపరచిన ఈ బృందాన్ని అభినందన సభ ఏర్పాటు చేశామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి నిమ్మగడ్డ రమేష్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జేఈఈలో ఏపీకి ఆలిండియా 8వ ర్యాంకు

పిట్జీలో విద్యార్థులు సందడి

విశాలాంధ్ర విజయవాడ ఎడ్యుకేషన్ : ఓపెన్ కేటగిరీలో జేఈఈ అడ్వాన్స్ 2024 ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ కు ఆలిండియా 8వ ర్యాంక్ వరించింది. ఈ సందర్భంగా పిట్జీ క్యాంపస్ లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ పిన్నెపు రమేష్ బాబు వివరాలను వెల్లడించారు. తమ కళాశాల విద్యార్థి కోడూరు తేజేశ్వర్ జేఈఈ ఫలితాల్లో ఆలిండియా 8వ ర్యాంక్ సాధించడం గర్వకారణం అని కొనియాడారు. ఈ ఫలితాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు మొదటి ర్యాంకు రావడం శుభపరిణామని సంతోషం వ్యక్తం చేశారు.దాదాపుగా 300మందికి పైగా విద్యార్థులు ఈ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించి ఐఐటీలో ప్రవేశం పొందారని తెలియజేశారు.

ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కూడా తమ విద్యార్థులు 100శాతం విజయం సాధించారని తెలిపారు. భవిష్యత్తు తరాలు విద్యార్థులకు ఈ విజయాలు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పాటు ప్రత్యేకమైన దృష్టి ఉత్తమశిక్షణ విద్యార్థులకు అందించి ప్రపంచ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు , అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థి తేజేశ్వర్ మాట్లాడుతూ తమది సామాన్యమైన కుటుంబమని తమ కళాశాల కృషితో ఆలిండియా 8వ ర్యాంకు సాధించడం నాకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రత్యేకమైన విద్యాబోధన విధానంతో పాటు శారీరక మానసిక, శారీరకంగాను చైతన్య పరుస్తూ విద్యను దించడంతో ఈ ర్యాంకు సాధించడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా క్యాంపస్ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి , బాణసంచా కాలుస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తుల ధ్వంసంపై ఫిర్యాదు

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : శనివారం రాత్రి జగ్గయ్యపేట పట్టణానికి చెందిన కొందరు టిడిపి కార్యకర్తలు తొర్రగుంట పాలెంకు వైఎస్ఆర్సిపి కార్యకర్త పాటి సాంబ ఇంటిలోకి చొరబడి ఇంట్లోనీ విలువైన వస్తువులను ధ్వంసం చేశారు. అంతేకాకుండా చంపుతాను అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాలని బాధితుడు పాటి సాంబ జగ్గయ్యపేట సీఐ జానకిరామ్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించి శిక్షించాలని ఆయన కోరారు.

రామోజీకి ఘన నివాళి

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : అక్షర సూర్యుడుగా పేరు గాంచి,తెలుగు రాష్ట్రాల కీర్తిని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మీడియా రంగంలో రారాజు రామోజీరావు హఠాత్ మరణానికి చింతిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ మీడియా అసోసియేషన్(ఏపిపిఎంఏ) జగ్గయ్యపేట కమిటీ వారు ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పాల్గొన్నగా,ఏపియంపిఏ జగ్గయ్యపేట అధ్యక్షులు కాకరపర్తి రమేష్,కార్యదర్శి కళ్యాణపు సూర్యప్రకాశరావు,బుడ్డి నాగయ్య,జిల్లా ఉపాధ్యక్షులు మెటికల శ్రీనివాసరావు మరియు కమిటీ సభ్యులు బి రాంబాబు,బి యశ్వంత్,టి రాంబాబు,వై రాకేష్,బి సురేష్,టి దుర్గారావు,యం ఉమా,డి.హరీష్,శివరామకృష్ణ,సింగ్, వెంకట్రావు,జహంగీర్, నాగార్జున, డి.శ్రీనివాసరావు, రామకృష్ణ, యల్.శ్రీనివాసరావు, ఆరుద్ర రమేష్,మర్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యంతో రామనామ సంకీర్తన

విశాలాంధ్ర అవనిగడ్డ : రామ నామ సంకర్తీన చేస్తూ రామ భక్తులు నృత్యం చేయడంతో పలువురిని ఆకట్టుకుంది. అవనిగడ్డ 3 వ వార్డులోని కోదండ రామాలయంలో హరే రామ నామ సంకీర్తన, శ్రీ శ్రీ అవదూతేంద్ర సరస్వతి స్వామిజీ వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం నుండి హనుమాన్ కోదండ రామ భక్త సమాజంచే హరే రామ నామ సంకీర్తన నిర్వహించారు. రాత్రికి కోడూరు మండలం నక్కవానిదారి హనుమాన్ నృత్య బృందం చే హరే రామ నామ నృత్య కార్యక్రమాన్ని నిర్వహించగా పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని హరే రామ నామ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కమిటీ పర్యవేక్షించగా ఆలయ ప్రధాన పండితులు క్రోవి శ్రీరామమూర్తి ఏర్పాటు చేసిన అల్పాహారం భక్తులకు అందచేశారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల అమిత బాప్టిస్ట్ చర్చి ఎదురు స్థలమందు ఆదివారం అరుంధతి విద్యార్థి సేవాసమితి ఆధ్వర్యం లో 10వ తరగతి,ఇంటర్మీడియట్ మరియు ఉన్నత చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీ ముండ్లపాటి పోతరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా శరత్ రిటైర్డ్ ఇండియన్ డిఫెన్స్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ భాస్కర్ రావు, రైల్వే ఆఫీసర్ ఆర్ టి డి సాహెబ్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ మెదూరి. రవి కుమార్ ఎస్ వి ఏ ఎస్ ఎస్ ప్రెసిడెంట్ గద్దం బాపిరాజు ఇంఫాం ప్రెసిడెంట్ శేషం తిరుమలరావు డైరెక్టర్ చీఫ్ ఇంజనీర్ పాల్గొనడం జరిగింది.

పేద విద్యార్థులు చదువుకోవడానికి కృషి చేస్తు అంబెడ్కర్ యొక్క పే బ్యాక్ టు ది సొసైటీ అనే నినాదం తో గ్రామం లో ఉన్న ఉద్యోగస్తులందరు కలసి విద్యార్థు లను ప్రోత్సహించి ఇలాంటి కార్యక్రమా లను చేయడం చాలా అభినందనీయం అని కొనియాడారు.అదే విధంగా సేవ సమితి ద్వారా పేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్,బస్ పాస్ లు,బ్యాంక్ కోచింగ్ లు,పుస్తకాలు, బ్యాగులు, ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్ళ దానికి ఆర్థికంగా ప్రోత్సాహం అందించి వారు ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందేలా కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం 10 వ,ఇంటర్మీడియట్ లలో ఉత్తమ కనపరచిన వారికి మొదటి(2000),ద్వితీయ(1500),తృతీయ(1000) బహుమతులు ఇచ్చి విద్యార్థులు అందరికీ (90) బ్యాగ్ లను ఇవ్వడం జరిగింది.మరియు ఉన్నత చదువులకు విదేశాలకు (లండన్,అమెరికా) వెళ్లిన 7 గురు విద్యార్థుల తల్లిదండ్రులకు,క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు, మరియు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి న వారిని దుశ్శాలువాతో సత్కరించా రు.సేవ సమితి కమిటీ సభ్యులు బలపోగు నాగేశ్వరరావు,కొండూరు రమేష్,వేల్పుల ప్రభాకర్,నెమలి వాసు,మాదుగుల పాపారావు,మంగల పూడి రమేష్,చిలుక విక్టర్ నగేష్, మార్కపూడి జార్జ్,శేషం గోపాలరావు, శేషం వెంకటరావు,ఆయిలపోగు పుల్లయ్య,తల్లిదండ్రులు,విద్యార్థులు,గ్రామ పెద్దలు,ప్రభుత్వ ఉద్యోగులు,అంద రూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

స్వామి దాసు నిన్ను క్షమిస్తున్నా: కొలికపూడి

విశాలాంధ్ర-తిరువూరు: టౌన్ లోని మధిర రోడ్డులో ఆదివారం %=జవీ% చర్చి ప్రాంగణంలో అఖండ మెజారిటీతో సాధించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సతీమణి మాధవి దంపతులకు దళితుల ఆధ్వర్యంలో పౌర సన్మానం నిర్వహించారు. శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలందరూ అర్ధరాత్రి వరకు నిలబడి ఓట్లు వేసిన అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను అన్నారు. వైసీపీ పార్టీ ఇంచార్జ్ స్వామిదాస్ ఎలక్షన్ అయిపోనివ్వండి కొలికిపూడి శ్రీనివాసరావు సంగతి చూద్దాం అన్నాడు అట . నేను స్వామి దాసు లాగా మాట్లాడను స్వామి దాసు నిన్ను క్షమిస్తున్నాను. నేను గృహప్రవేశం చేసిన రోజు వాళ్ళ సురేష్ అనే వ్యక్తి గొడవ చేశారు. స్వామి దాసు ప్రచార రథం నా ఇంటి ముందు ఉన్న పందిరిని గుద్ది వెళ్ళింది. మధుర రోడ్డు ని విశాలం చేసి అభివృద్ధి చేస్తాను డివైడర్ కట్టి రోడ్డుకి ఇరువైపులా షాపులు పెట్టించి 20 మందిని సెలెక్ట్ చేసి ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున ఇచ్చి ఆదుకుంటాను అన్నారు. ఆ ఐదు లక్షలు నాకు ఇయ్యవలసిన పనిలేదు మీరు ఇంకొక 20 మందికి సహాయం చేయండి అంటూ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు తెలుగుయువత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్య వైశ్య ర్యాంకర్లకు స్వర్ణపతకాల బహూకరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆవోపా బ్యాంక్ మెన్ చాప్టర్ (హైదరాబాదు) సంస్థ ఆద్వర్యంలో 2024 ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపిన ఆర్య వైశ్య విద్యార్థులను స్వర్ణపతకాలతో సత్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షులు పి వి రమణయ్య, విజయవాడ ప్రతినిధి ఎక్స్ రే సంస్థ అధ్యక్షులు కొల్లారిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల లో 2024 ఎంమ్సెట్, నీట్, జె ఇ ఇ(అడ్వాన్స్) ప్రవేశ పరీక్షల్లో మొదటి వెయ్యి ర్యాంకు లు సాధించిన వారిలో వంద మంది ఆర్యవైశ్య విద్యార్థిని, విద్యార్థులకు స్వర్ణ పతకం బహుకరించి, సన్మానించడం జరుగుతుందని పేర్కొన్నారు. సభ ఈనెల 30 న హైదరాబాదు లో జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈమెయిల్‌కి ఈనెల 20తేదీ లోపు తమ దరఖాస్తులను పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9441928528, 9290529133, 9848121763 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

చంద్రబాబు పాలనలో యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు: బేగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): చంద్రబాబు పాలనలో యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు ఉంటాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్ బేగ్ అన్నారు. ఆదివారం ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించిన సందర్భంగా వించిపేట బేగ్ కార్యాలయం వద్ద తెలుగు యువత ఆధ్వర్యంలో విజయోత్సవాలు జరిపారు. బేగ్ కేక్ కట్ చేసి యువతకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో తెలుగు యువత ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. గత ప్రభుత్వంలో ఉపాధి అవకాశాలు లేక విద్యార్థులు,నిరుద్యోగులు ఎంత ఇబ్బందులు పడ్డారని అన్నారు. చంద్రబాబు పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలపల్లి రాజు, పైలా సతీష్, తమ్మిన శేఖర్, బేవర సాయి, సుధాకర్, దుర్గారావు, బోగవల్లి నాగబాబు, సందకు సురేష్, దేవరకొండ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్కు బోర్డు ధ్వంసం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ 42వ డివిజన్‌లో పార్కు బోర్డును టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ ఘటన విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రాంబే రోడ్డులోని వైఎస్సార్ పార్కు బోర్డును ధ్వంసం చేశారు. బోర్డు పై ఉన్న వైఎస్సార్ పేరును తొలగించారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.

వైసీపీ కార్యకర్త దుకాణంపై దాడి

విశాలాంధ్ర - విజయవాడ (క్రైమ్): వైసీపీ కార్యకర్త భాష టైలరింగ్ దుకాణం పై టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆదివారం విజయవాడ అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సింగ్ నగర్ లూనా సెంటర్లో భాషా టైలరింగ్ షాప్ నిర్వహిస్తారు. దుకాణంలోని టైలరింగ్ మెషీన్‌లు, ఎల్ఇడీ టీవీ, ఫర్నిచర్ టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త వేల్పుల విజయ్‌బాబుతో పాటు మరికొంత మంది పాల్గొన్నట్లు గుర్తించారు.వేల్పుల విజయ్ బాబుతో పాటు ఆరుగురి పై కేసు నమోదు చేసిన అజిత్ సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ బైక్ దగ్ధం

విశాలాంధ్ర - విజయవాడ (క్రైమ్): వైసీపీ సోషల్ మీడియా ఇంఛార్చ్ వెంకట్ బైక్ ను గుర్తుతెలియని దుండగులు తగలపెట్టారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఫకీర్ గూడెం కు చెందిన వెంకట్ వైసీపీ సోషల్ మీడియా ఇంఛార్చ్ గా ఉన్నారు. శనివారం రాత్రి తన బైక్ ఇంటి ముందు పెట్టి నిద్రపోయాడు. అర్ధరాత్రి బైక్ తగలపడుతుంది స్థానికులు చెప్పడంతో బయటకు వచ్చే సరికి బైక్ పూర్తిగా తగలపడింది. ఈ మేరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.